# గుండెతడి

పంతుల జోగారావు



కథలు

# గుండె తడి

## పంతుల జోగారావు

## కథా క్రమం


1. అమ్మా బళ్ళోకి వెళ్ళనే
2. అల్లుడోడు
3. గెలుపు
4. బొమ్మల చొక్కా
5. గుండె తడి
6. శిక్ష
7. ఉదయం నుంచీ వాన !
8. శరణు ! శరణు !
9. తూర్పు వెళ్ళని రైలు
10. నరమేధం జరుగుతోంది
11. ఊరికి నిప్పంటుకుంది
12. ఎర్రజీరల కళ్ళు
13. అభ్యంతరం లేదు
14. గురు దక్షిణ
15. వేడుక
16. ధిక్కార స్వరం
17. షరతులు వర్తిస్తాయి !
18. నిలబడు
19. అపురూపం
20. గోవు మా లచ్చిమికి కోటి దండాలు
21. పట్టు పరికిణీ
22. ఇబ్బందే
23. వరద
24. ఇంటింటి బూరి


## అంకితం

నా జీవన సహచరి

విజయ లక్ష్మికి ప్రేమతో ...

# అమ్మా ,బళ్ళోకి వెళ్ళనే

సూరిబాబుకి తెలివొచ్చి చాలా సేపయింది.

అయినా  ముసుగు తియ్య లేదు.

మత్తుగా , మగతగా ఉందింకా. చలికి మూడంకె వేసుకుని, ముసుగు తన్ని పడుకోవడం  ఎంతో హాయిగా ఉంది.

వాడికి తెలుసు. ఈ హాయి అట్టే సేపు వుండదు.

అమ్మ లేవమని ఒకటే సతాయిస్తుంది. లేచే వరకూ ఊరుకోదు. అమ్మ కన్నీ తొందరే. గోరు వెచ్చని నీళ్ళు వొంటి మీద కుమ్మరించేసి,స్నానం ఆదరాబాదరాగా చేయించేస్తుంది. “ నేను పోసుకుంటానే, చెంబియ్యవే” అంటే వినదు. తనయితే తలంతా తడిపేసుకుంటాడుట. స్నానం పూర్త యేక , చొక్కా నిక్కరూ తొందరగా తొడిగేసు కోవాలి.

మళ్ళీ ఆ నీలం నిక్కరే. ఆ గళ్ళ చొక్కావే.

తనకున్న మూడు జతల్లోకీ అవే మంచివి. రెండ్రోజులకోసారి వాటినే వుతికి ఆరేస్తుంది.      అవంటే అసయ్యం తనకి.

“ పొలిస్టరు చొక్కా కుట్టించవే. నాన్నతో చెప్పవే” అని సణుగుతాడు తను. ఈ అసయ్యం బట్టల్తో బళ్ళోకెళ్ళనని మొరాయిస్తాడు.      అమ్మ తన మాట పట్టించుకోదు.

“ ఇప్పుడీ ఖర్చుల్లో నీకేం బట్టలు తీస్తార్రా, మీ నాన్న? పండక్కి కుట్టించు కుందువుగాని” అనేస్తుంది.  పండగంటే, పెద్ద పండుగ. అదొస్తే కాని, తనకి మరో మంచి బట్టల జత రాదన్న మాట. పెద్ద పండుగకే కుట్టించాలనెక్కడుంది?  ఈ లోగా ఎన్ని పండుగలు లేవు? వినాయక చవితి లేదూ ! దసరా లేదూ ! అన్నట్టన్నట్టు – దశమి వెళ్ళాక, సరిగ్గా పన్నెండు రోజులకి తన పుట్టిన రోజు వస్తుంది కదా!

ఉహూఁ !

వాటన్నిటికీ బట్టలు కుట్టించడం అనే అలవాటు తప్పించేసి చాన్నాళ్ళయింది.

మా లతక్కయ్య పెళ్ళికి,నాన్నమ్మ జబ్బుకి చాలా డబ్బయి పోయిందిట.

అయితే ఎవడిక్కావాలి?

అసలు డబ్బులయి పోవడమంటే ఏఁవిటో !

ఒక్కో రోజు, యింట్లో  బియ్యం లేవని అమ్మ చెబితే “ డబ్బుల్లేవే” అంటాడు నాన్న. మళ్ళీ అంతలోనే “ ఎవర్నయినా అడిగి తెస్తాను. సాయంత్రం వచ్చేటప్పుడు బియ్యం పట్టించు కొస్తాన్లే”  అంటాడు.

ఎవరిస్తారో తెలీదు. నాన్న అడిగితే యివ్వని వాడు లేడు కాబోలు. సాయంత్రంకల్లా బియ్యం తెస్తాడు. మరి పొద్దున్న డబ్బులు లేవన్నాడే? పోనీ అలాగే ‘ఎవర్నయినా అడిగి ’తెచ్చి, తనకి మంచి బెల్బాటం ఫేంటూ,పొలిష్టరు చొక్కా కుట్టించ కూడదూ, నాన్న !  అలా చెయ్యడంతే.

ప్రసాదుకీ, వెంకట బాజ్జీకీ బ్రహ్మాండమయిన బట్టలున్నాయి.  బాజ్జీ గాడి బజ్జీల చొక్కా అయితే మరీనూ ! ఆ వెధవసలు వాడి చొక్కా మీద చెయ్యి వెయ్యనివ్వడంతే. బోడి గొప్పా వాడూనూ. ఈ సారి డ్రిల్లు క్లాసులో వాడి నడ్డి మీద సిరా జల్లెయ్యాలి !

తనకీ ఓ బజ్జీల చొక్కా వుంటే బావుణ్ణు.

నాన్న కుట్టించడు గాక కుట్టించడు.

అమ్మ నాన్నతో చెప్పదు గాక చెప్పదు.

చలపతన్నయ్య కాలేజీకి వెళ్తున్నాడని చెప్పి, వాడికి రెండు ఫేంట్లు కుట్టించారు. చిన్నక్కయ్యని మూల కూచో పెట్టి నప్పుడు సిలుకు వోణీలు కుట్టించారు.

చిన్నన్నయ్య చెప్పుల కోసం ఎంత గొడవ చేసాడు? నాన్న తన కిర్రు చెప్పుల్లాంటివి చవగ్గా  వస్తాయని, అలాంటివి కుట్టిస్తానంటే గోల పెట్టేసాడు. వాడికవమానంట. అందరూ నవ్వుతార్ట.

ఆ మాట కొస్తే తన కసలు చెప్పులే లేవు. తనకెంత అవమానంట ! ఎప్పుడో బాచి మాఁవయ్య కొని పెట్టేడు. అవేం  జోళ్ళో ! రెణ్ణెళ్ళు తొడిగాడో లేదో, చిరిగి చిరిగి ముక్కలు ముక్కలయి పోయేయి. మళ్ళీ తన జోళ్ళ గురించి అసలెవరూ పట్టించు కోలేదు.

బాచి మావయ్య మళ్ళీ వొస్తే బావుణ్ణు.

అవును !

బాచి మావయ్య ఎంత మంచి వాడో చెప్పలేం. వచ్చేటప్పుడు తన కోసం ఏదేనా తెస్తాడు. తగరపు వలస జీడి పప్పు తెస్తాడు. మేట్నీకి తీసికెళ్తాడు. వెళ్ళి పోయేటప్పుడు డబ్బులు కూడా యిస్తాడు.

అన్నిటి కన్నా ముఖ్యంగా –

బాబి మావయ్య వచ్చిన రోజున అమ్మేవయినా తినడానికి మంచివి చేస్తుంది. ఉదయం ఉప్మా, కాఫీ. మధ్యాహ్నం పులిహోర, సేమ్యా. ఆ రోజు భోజనం భలేగా ఉంటుంది. మామూలప్పుడు అన్నం తిన్డవే తనకి మంట. ఓ రోజు పప్పు వండితే, మరో రోజు వండదు. ఎప్పుడూ చారు నీళ్ళూ, పెసర బద్దల పచ్చడీనూ. కూరుంటే వుంటుంది, లేక పోతే లేదు. చేసినా, ప్చ్ ! తోట కూర. తనకి నచ్చదు. తోటకూర వొండొద్దని అడిగితే నాన్న తిడతాడు. తోట కూర బలంట. పైగా దబాయింపు కూడానూ.

బాబి మావయ్య వెళ్ళి పోయేటప్పుడు తన చేతిలో రూపాయో, రెండో పెడతాడు. మావయ్య రిక్షా ఎక్కి వెళ్ళి పోగానే అమ్మ తన దగ్గర నుంచి ఆ డబ్బులు కాస్తా తీసుకుంటుంది. అలాంటప్పుడు తన కెంత ఏడుపు వొస్తుందో !

"అంత డబ్బు నువ్వేం చేసుకుంటావురా? నేను దాస్తాన్లే యివ్వు." అంటూ తీసుకుని, తనకి ఓ పావలా యిస్తుంది. ఏం అనలేక ఉక్రోషంగా ఉంటుంది తనకి. కానయితే, ఆ పావలా మాత్రం మామూలుగా అమ్మ తన కెప్పుడిస్తుంది కనుక? దాంతో ఐస్క్రీం కొనుక్కో వచ్చు. తాటి బెల్లం అచ్చులు కొనుక్కో వచ్చు.

అంచేత బాబి మావయ్య వస్తే తనకి పండుగ వచ్చినట్టే.

అసలు – బాబి మావయ్య అనే ఏమిటి ? ఇంటికి చుట్టాలు ఎవరొచ్చినా కూడా అంతే !

చుట్టాలు వొస్తే , తను బళ్ళోకి వెళ్ళక్కర లేదు.

భలే సరదాగా ఉంటుంది. హాయిగా ఆడుకో వచ్చు. చుట్టాల వాళ్ళ పిల్లల్ని తీసుకుని, కొబ్బరి తోటకెళ్ళి కొబ్బరాకు బొమ్మలూ, బూరలూ చేయొచ్చును. వేణు గోపాల స్వామి కోవెల దగ్గర చెట్ల కింద ఇసకలో చక్కా ఆడుకో వచ్చును.

పెసర బద్దల పచ్చడీ –

అసయ్యం అసయ్యం తోట కూర కూరా –

నీళ్ళ మజ్జిగా –

ఈ బాధ వుండదు. చద్దన్నం తిన్డవే కాక, కాఫీ కూడా తాగొచ్చు !

" అన్నాలు తినే వాళ్ళు కాఫీలు మానేయాల్రా " అని రూల్సు పెట్టేడు పెద్దన్నయ్య. ఆ మాట కొస్తే, కాఫీలు తాగే వాళ్ళంతా అన్నాలు తిన్డం మానేసి నట్టు !

చుట్టాలొస్తే మేట్నీకెళ్ళొచ్చు.

అట్నుంచి రాగానే – పకోడీలో,బజ్జీలో వేడి వేడిగా రెడీగా ఉంటాయి. అందుకని, చుట్టాలొస్తే ఎంతో బావుంటుంది. అమ్మకీ, నాన్నకీ చుట్టాలొస్తే నచ్చదెంచేతో ?

చుట్టాల వాళ్ళు పెరట్లో స్నానాలు చేస్తున్నప్పుడో, వాళ్ళింకా పక్కల మీంచి లేవనప్పుడో – అమ్మా నాన్నా చాటుగా ఓ మూలకి చేరి, ఏవేవో గుస గుసలు మాట్లాడీసు కుంటారు. అమ్మేదో అంటుంది. మధ్య మధ్య నుదుటి మీద చేత్తో కొట్టుకుంటూ. నాన్న కోపంగా చూస్తుంటాడు. అన్నయ్యెప్పుడేనా డబ్బులడిగితే ధాం ధూం లాడి పోతుంటాడే, అలా పెడతాడన్న మాట ముఖం. తనకప్పుడు భయం వేస్తుంది.

కొంపదీసి, వీళ్ళు గుస గుసలాడీసుకుని, చుట్టాలకి పులిహోర, సేమ్యా గట్రాలు చెయ్యకుండానే పంపించేస్తారేవిటి చెప్మా? అనిపిస్తుంది.

నాన్న కోపం తెచ్చేసుకుని, రిక్షా పిలిపించీసి, వాళ్ళని వెళ్ళి పొమ్మంటాడేవో ! అమ్మ తనని బళ్ళోకి వెళ్ళమని పంపించేస్తుందేమో ! అని గుండె లబ లబలాడి పోతుంది.

అలా జరగకూడదు దేవుడా ! అని మొక్కు కుంటాడు.

ఉత్తినే తన భయం కానీ, అసలలాగెప్పుడూ జరగదు. జరగ లేదు కూడా !

అమ్మకి , నాన్నకి వాళ్ళ మీద ఎంత చికాగ్గా ఉన్నా, వాళ్ళెదుట మాత్రం నవ్వుతూ మాట్లాడుతారు. పొమ్మను. వాళ్ళ కన్నీ చేసి పెడతారు.

వాళ్ళు వెళ్ళి పోయేటప్పుడు సెంటరు వరకూ వెళ్ళి , తననే రిక్షా తీసుకు రమ్మని పురమాయిస్తారు. అప్పుడు ఝుమ్మని పరుగెత్తుకెళ్ళి, రిక్షాలో ఒక్కడూ కూచుని రావొచ్చు !

ఆ మధ్య దొడ్డమ్మా వాళ్ళూ వచ్చినప్పుడు తన కోసం బళ్ళోకెళ్ళడానికి సంచీ తీసుకుని వచ్చేరు.

అందుకే చుట్టాలొస్తే ఎంతో సంతోషంగా ఉంటుంది తనకి.

బళ్ళోకెళ్ళి వచ్చేటప్పుడు " దేవుడా ! మా ఇంటికివాళ చుట్టాలు రావాలి !" అని మొక్కు కుంటాడు.

ఒక్కొక్కసారి దేవుడు దయతల్చి, చుట్టాల్ని పంపిస్తూ వుంటాడు. మరో సారి అసలెవరూ రారంతే.

ఎవరూ రానప్పుడు –

మళ్ళీ ఆ పెసర బద్దల పచ్చడీ –

అసయ్యం అసయ్యం తోటకూర కూరానూ ...

0 0 0

సూరి బాబుకిప్పుడు నిద్ర మత్తు పూర్తిగా వొదిలి పోయింది. అయినా, ముసుగు తియ్యకుండా అలాగే పడుకున్నాడు.

వాడికివాళ  చెప్పలేనంత సంతోషంగా వుంది.

ఇంట్లో చుట్టాలున్నారు !

మీసాలాయనా, వాళ్ళావిడా, యిద్దరు పిల్లలూ – ఒకర్తి పేరు వెంకట నరసమ్మట. నిన్న తనతో  సరదాగానే మాట్లాడింది.  కాని, దానికి కొంచెం పొగరెక్కువలాగుంది. సమయం చూసి, యివాళ దాన్నడ్డి వాయ గొట్టాలి. దాన్నసలు వేణు గోపాల స్వామి కోవిల దగ్గరకి తీసికెళ్ళ కూడదు.

రెండోది మంచిదే. దాని పేరు సుభద్రట. శకుంతలత్తయ్య కూతురి పేరూ సుభద్రే.  ఆ సుభద్ర కూడా మంచిదే. ఈ పిల్లా మంచిదే. "మా పిల్లని పెళ్ళాడతావా!" అనడిగేడు మీసాలాయన నిన్న. వెంకట నరసమ్మనయితే ఛస్తే పెళ్ళాడను. సుభద్రనయితే ఆలోచించాలి.

ఇవాళ చుట్టాలంతా ఇంట్లోనే వున్నారు. ఏఁవయినా తను బళ్ళోకి వెళ్ళక్కర లేదు !

అసలీ చుట్టాలని తనే సంపాదించుకున్నాడు, నిన్న !

వాళ్ళసలు తమ యింటికి రాలేదు. పక్క వాటాలోని శంకరంగారూ, కళ్ళద్దాల కరుణ గారూ లేరూ, వాళ్ళింటికి వచ్చేరు.

నిన్న సాయంత్రం –

చీకటి పడుతున్నప్పుడు –

అప్పుడు – తను వీధి మలుపు దగ్గర బాదం చెట్టు కింద కబాడీ ఆడుకుంటున్నాడు.

అంతలో – సామాన్లతో రిక్షాలో మీసాలాయనా వాళ్ళూ వొస్తూ కనిపించేరు.

చుట్టాలు ! చుట్టాలు !!

ఎవరింటికి వస్తున్నారో !

ఆ రిక్షా వేపు ఎంతో యిదిగా చూసేడు. వాళ్ళు తమ యింటికి వస్తే ఎంత బాగుణ్ణు అనుకున్నాడు.

" ఎక్కడి కండీ? ఎవరింటికెళ్ళాలండీ ! " అనడిగేడు ఆత్రంగా.

మీసాలాయన రిక్షా ఆపించి, " జి.శంకరం గారింటికి వెళ్ళా లబ్బాయ్...వాళ్ళుండేది యీ వీధిలోనే కదా... నీకు తెల్సా " అనడిగేరు.

జి.శంకరం గారంటే, పక్కింటి కరుణ గారూ వాళ్ళన్న మాట. అయ్యో ! వాళ్ళిప్పుడే ఊళ్ళో లేరే ! వీళ్ళకెలాగ ! అనిపించింది. పోనీ, పాపం తమ యింటికి తీసికెళితేనో అనే ఆలోచన వచ్చింది.

వెంటనే, " ఓ ! తెలుసు...రండండి...చూపిస్తాను." అని యింటికి తీసుకొచ్చేడు.

ఇంటికి రాగానే రిక్షా వాడి చేత సామానంతా యింట్లో పెట్టించాడు.

అమ్మా చిన్నక్కయ్యా వాళ్ళూ ఆ వచ్చిన వాళ్ళ వేపు ఆశ్చర్యంగానూ సందేహంగానూ చూడసాగేరు. " వీళ్ళెవరురా !" అన్నట్టు తన వేపు చూసేరు

మీసాలాయనా వాళ్ళూ కూడా ఆశ్చర్య పోయి చూస్తున్నారు.

తనింక తడుముకోకుండా గడ గడా చెప్పేసాడు : " వీళ్ళు మన కళ్ళజోడు కరుణ గారూ వాళ్ళింటికొచ్చారే పాపం ... మరి వాళ్ళు ఊర్లో లేరు కదా?  మరెక్కడ కెళ్తారని మనింటికి తీసుకొచ్చేసానే... ఏం..."

" అయ్యో ! కరుణా వాళ్ళూ లేరూ ! యిప్పుడేం చెయ్యడం..." అంది గాభరాగా మీసాలాయనా వాళ్ళావిడ.

" అరరే ! పొరపాటయిందండీ...మరి మేం  వస్తామండీ..." అనేసాడు మీసాలాయన గబుక్కున. శంకరం గారూ వాళ్ళూ ఊర్లో లేనందుకు వాళ్ళు ఎంతో బాధ పడ్డారు.

తన గుండెలో రాయి పడ్డట్టయింది.

బెంగ బెంగగా అమ్మ వేపు చూసేడు.

అమ్మ వో నిముషం మాట్లాడ లేదు. మళ్ళీ ఏం అనుకుందో –     " ఫర్లేదండీ అన్నయ్యగారూ... పిల్లలతో యింత రాత్రప్పుడు ఎక్కడి కెళ్తారు? మా యింట్లో ఉండి వెళ్ళొచ్చు. మీరొచ్చి వెళ్ళి పోయేరనీ, ఇబ్బంది పడ్డారనీ తెలిస్తే కరుణ బాధ పడదూ! వాళ్ళ చుట్టాలకి ఆమాత్రం ఓ పూట ఆతిథ్యం యిచ్చేం కాదని నొచ్చుకుంటుంది కూడా. మాకు మాట పడాల్సి వుంటుంది సుమండీ ! మీరు మరేం అనొద్దు. అసలే చంటి పిల్లల్తో ఉన్నారాయె ! మీకేం ముఖమాటం పడే పని లేదు. మాదీ మీ చుట్టాల యిల్లే అనుకోండి... రండి పిన్ని గారూ, కాళ్ళూ చేతులూ కడుక్కుందురు గాని..." అంది.

తనకి కొండెక్కినట్టయింది.

మొదట మీసాలాయనా వాళ్ళూ వుండటానికి మొఖమాట పడి, వొప్పుకోలేదు. కానీ, సుభద్ర , " అమ్మా, ఆకలే" అని ఏడవడంతో వొప్పుకున్నారు.

అమ్మ చిన్నక్కయ్యని చాటుగా పెరట్లోంచి బియ్యం కోసం కాబోలు, చేట చేతికిచ్చి మీనాక్షమ్మ గారింటికి పంపించింది.

పాలవాడొస్తే – వాడ్ని వీధి వసారా చివరకి తీసికెళ్ళి, పాత బాకీ రేపొచ్చే ఫస్టుకి యిచ్చేస్తామనీ, యింటికి చుట్టాలొచ్చేరనీ, ఓ లీటరు పాలు ఎక్కువ పోయించమనీ బతిమిలాడింది.

ఇంతలో నాన్న వచ్చేడు. నాన్నని గదిలోకి తీసికెళ్ళి అమ్మ చుట్టాల సంగతి చెప్పింది.

నాన్న పళ్ళు నూరుతూ అక్కడ్నుంచే తన వేపు కోపంగా చూసేడు. భయం వేసింది. ఆ సందడిలో అదేం పట్టించుకో లేదు తను.

తర్వాత గదిలోకొచ్చి , నాన్నకూడా నవ్వుతూ వాళ్ళని పలకరించేడు. బజారుకెళ్ళి కూరలూ అవీ కొనుక్కొచ్చేడు కూడానూ.

రాత్రి భోజనాలయేక మీసాలాయన తనని దగ్గరకి తీసుకుని కబుర్లు చెప్పేరు. వూళ్ళో సినిమాలేం ఆడుతున్నాయో అడిగేరు.

అంటే – రేపు తనని సినిమాకి తీసికెళతారన్నమాట.

రేపు మరి బళ్ళోకి వెళ్ళక్కర లేదన్న మాట !

హాయిగా ఆడుకోవచ్చు ! భలే భోజనం తినొచ్చు !

తనకి చెప్పలేనంత సంతోషం కలిగింది.

మీసాలాయనా వాళ్ళ కాంతం గారు తనని ఎంత మెచ్చుకుందో ! " బుద్ధిమంతుడండీ కుర్రాడు. మన ముండా వుంది ఎందుకూ...ఈ మర్యాదా...ఈ మప్పితం..." అంటూ తన బుగ్గలు గిల్లింది. అప్పుడు తనకెంతో గర్వంగా అనిపించింది. సిగ్గుగానూ అనిపించింది.

వెంకట నరసమ్మతోటీ, సుభద్ర తోటీ హాయిగా కబుర్లు చెప్పేడు. అప్పుడే వెంకట నరసమ్మకి గర్వం అని పోల్చేసుకున్నాడు. సుభద్ర మంచి దని కూడా తనకి అర్ధమైపోయింది. అప్పుడే కదా మీసాలాయన 'మా పిల్లని పెళ్ళి చేసుకుంటావుటోయ్ ' అనడిగింది ! ఎవర్నో తెలీలేదు. సుభద్ర యితే ఓ.కే.

అలా, కబుర్లు చెప్పుకుంటూనే నిద్రలోకి జారుకున్నారు.

0 0 0

"ఏరా సూరీ ! ఇంకా పక్క మీంచి లేవవేం? బళ్ళోకి వెళ్ళవా ఏం?" అమ్మ గొంతు వినిపించింది.

సూరి బాబు తటాలున ముసుగు తొలగించేడు.

ఇంట్లో చుట్టాలుండగా సర్దాగా ఆడుకోనివ్వకుండా అమ్మ బళ్ళోకి వెళ్ళమంటుందేం?" అనుకున్నాడు కోపంగా.

"అమ్మా బళ్ళోకి వెళ్ళనే..." అన్నాడు గారాలు పోతూ.

" ఏం... ఏమొచ్చిందిరా నీకు మాయ రోగం..." అది నాన్న గొంతు. గెడ్డం చేసుకుంటున్నట్టున్నాడు. లేక పోతే తగల్నిచ్చే వాడే.

సూరి బాబు బెదిరి పోయి, లేచి పక్క మీద కూచున్నాడు.

" చుట్టాలున్నారు కదే...యివాళ బడి మానుస్తానే..."అన్నాడు తల్లికి వినిపించేలా సణుగుతూ.

" ఇంకా ఎక్కడున్నార్రా వాళ్ళూ – పొద్దున్నే బండికి వెళ్ళి పోయేరు...అవును కానీ వెధవా ! వేలెడంత లేవు...నీకీ పెత్తనాలూ, నిర్వాహకాలూ ఏఁవిట్రా? వాళ్ళింటికొచ్చిన చుట్టాల్ని మన నెత్తి మీద కెందుకు తీసుకొచ్చేవసలు? అసలప్పుడే తగల్నిద్దును కానీ,బావుండదని వూరుకున్నాను. రాత్రసలే బియ్యం నిండుకున్నాయి యింట్లో. బియ్యానికీ, కాఫీ పొడికీ ఎంత యిబ్బంది పడాల్సి వచ్చిందో తెలుసా ! " అమ్మ తిడుతోంది.

చుట్టాలు వెళ్ళి పోయేరా !

సూరి బాబు గుండె ఆగినంత పనయింది.

వాడి ఆశలన్నీ నిరాశలయి పోయేయి. మనసంతా ఏదో బెంగా, బెగులూతో వికలమైపోయింది.

" వాడికీ మధ్య దరువుల్లేక అలా అడ్డ గాడిదలా తయారవుతున్నాడు వెధవ ! ...వెధవా అని!" నాన్న కోపంగా అరుస్తున్నాడు. చిన్నక్క, అన్నయ్యలు కూడా పట్టుకుని దులిపేస్తున్నారు.

" లే,లే ! ...బడికి వేళవుతూంది." అమ్మ కసిరింది.

సూరి బాబు అవమానం భరించ లేక, లేచి, ముఖం కడుక్కుని, స్నానం చేసి తెమిలాడు.

చల్దన్నం తిన లేక తిన లేక తిని, ఏడుపు ముఖంతో భుజాన పుస్తకాల పంచీ వేలాడదీసుకుని, బళ్ళోకి బయలు దేరాడు.

నడుస్తూనే దార్లో అసహనంగా , కోపంగా తనలో అనుకున్నాడు : 'హు ( ! తను పెద్దయ్యాక ఎవరయినా చుట్టాలు ఇంటికొస్తే తెల్లార కుండానే యిలా పంపించేస్తాడేంటి? వాళ్ళు వెళ్ళి పోతామన్నా సరే, బలవంతంగా ఉంచెయ్యడూ ! ? వాళ్ళతో సరదాగా వుండడూ !' అని.

సూరి బాబు కళ్ళ వెంట నీళ్ళు తిరుగుతున్నాయి.

వాడి కేడుపొస్తోంది.

0 0 0

**అంకితం**

తమ అందమైన ఆశలూ, ఆలోచనలూ ఎందుకు నెరవేర కుండా పోతూ ఉంటాయో తెలుసుకో లేని సూరి బాబు లాంటి అమాయకులైన చిన్న చిన్న పిల్లలకి ముద్దులతో ...

స్వాతి మాస పత్రిక 1980 సంచికలో ప్రచురణ

రంజని, తెలుగు సాహితీ సమితి వారు ప్రచురించిన ' మంచి కథ ' కథా సంపుటిలో పునర్ముద్రణ.
సంకలన కర్త : చీకోలు సుందరయ్య.

# అల్లుడోడు

పెద్ద సైజు రేకు పెట్టె మీద లాఠీ కర్రతో చప్పుడు చేస్తూ, " అందులో ఏముంది తియ్ " అన్నట్టుగా తలెగరేసాడు - ఆ బుర్ర మీసాల రైల్వే పోలీసు. పక్కనే మరో కానిస్టేబిలు ఆ దంపతుల వేపు మార్చి మార్చి చూస్తున్నాడు.

ఈ తతంగం మొదలయి పది నిముషాలవుతోంది. రైలు పరిగెడుతోంది. ఆ జనరల్ కంపార్ట్‌మెంట్ దట్టంగా నింపిన ఊక బస్తాలా కిక్కిరిసి పోయి ఉంది. రాత్రి పదకొండు దాటు తోంది. శీతా కాలం చలి గాలి వొంటిని ఝుల్‌మని పిస్తోంది.

కంపార్ట్‌మెంట్ లోకి పోలీసులు వచ్చి , ప్రయాణీకుల వస్తువుల్ని చెక్ చెయ్యడం మొదలయ్యేక, నిద్రలో జోగుతున్న వాళ్ళందరికీ మత్తు వదిలి పోయింది. మెలకువగా ఉన్న వాళ్ళు పోలీసుల చెకింగ్ బెడదకి విసుక్కుంటున్నారు. రాష్ట్రంలో మద్య నిషేధం మొదలయ్యేక, రైళ్ళలో, బస్సుల్లో ప్రయాణీకుల మీదా,వారి వస్తువుల మీదా నిఘా ఎక్కువయింది. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలలో ఐతే, మరీ ఎక్కువయింది. నిషేధం సడలించినా, అక్రమంగా రవాణా చేసే సారా పేకట్ల కోసం తణికీలు తప్పడం లేదు. సారా మీద నిషేధం అలాగే ఉందిమరి.

“తియ్యమంటే నీక్కాదూ?” విసుగ్గా అన్నాడు మొదటి పోలీసు.

ముసిలాయన బెంబేలెత్తి పోయేడు. అతని పక్కనే గొంతుక్కూర్చున్న ఆ ముసలామె ఒక్క ఉదుటన పెట్టి మీదకి ఎక్కి కూర్చుంది. ఆమె కళ్ళలో భయం చారికలు చారికలుగా పరుచు కుంటోంది.

“టిక్కెట్లు తీసినాం కాదా !” బెదురుతూ తీసి చూపించిందామె.

బుర్ర మీసాల పోలీసు కోపంగానూ, నిర్లక్ష్యంగానూ తలెగరేసాడు. “ అది సరే !... ఆ పెట్టెలో ఏటుందో సూపించు ముందు...” అని వో వంకర నవ్వు నవ్వేడు.

ముసిలాయన శరీరంలో సన్నని వణుకు మొదలయింది. దెయ్యాన్ని చూసిన వాడిలా ఆ పోలీసాయన వేపు చూస్తున్నాడు.

ఆమె పరిస్థితి కూడా అంత కన్నా ఏమీ మెరుగ్గా లేదు. బెంగల కొండ మోస్తున్న దానిలాగా కళ్ళలో నీళ్ళు కుక్కుకుని ఉంది.

కంపార్టుమెంట్‌లో లెట్రిను ప్రక్కనే పెట్టె పెట్టుకుని, ప్రయాణం చేస్తున్నారు వాళ్ళు. పోలీసులు పెట్టె సోదా చేస్తామనే సరికి, ఇద్దరికీ ప్రాణాలు పైపైనే పోయినట్టయింది. కంగారుగా లేచి నించోడానికి ప్రయత్నించేరు. కానీ, లేవడానికి శక్తి చాల నట్టుగా చతికిల పడి పోయేరు.

వాళ్ళు ఉలుకూ పలుకూ లేకుండా బెదురు చూపులు చూస్తూండడంతో పోలీసులలో అనుమానం ఎక్కువయింది.

లాఠీ ఝుళిపించి, ముసిలాయన వొంటి మీద చిన్న దెబ్బ వేసాడు ఒక పోలీసు.

“ మనం యిలా బాబూ, నయ్‌నా ఏటున్నాదమ్మా, అందులో? అని ముద్దుగా అడిగితే ఆళ్ళేం సెబుతారు గురూ ! బొక్కలో తోసేసి , నాలుగు తగిలిస్తే నోళ్ళిప్పుతారు...” రెండో పోలీసు బెదిరింపులకి దిగేడు.

పెట్టెకి తాళం వేసుంది.

“ ఏయ్... ఏటీ, ఆ పెట్టె తాళం తీసి, ఏటుందో వో పాలి సూపించు... సెప్తుంటే నీక్కాదేటి?' ...తియ్ తాళం...”

“ తాళఁవా ! తాళం... పోనాది బాబూ...” ఏడుపొక్కటే తరవాయిగా అందామె.

పోలీసులకి చిర్రెత్తుకు పోయింది. వాళ్ళ తీరు చూస్తూంటే అందులో ఏదో ఉండి తీరాలని పిస్తోంది. ఒరిస్సా నుండి సారా పేకెట్లు తెస్తున్నట్టున్నారు. లాభం లేదు...తాళంతీయించి సోదా చెయ్యాల్సిందే...

తాళం తీసి పెట్టెలో ఏముందో చూపించమని మరో మారు గదమాయించేడు. ఆ ముసలి దంపతులు వాళ్ళని ఏడుస్తూ బ్రతిమాలు కుంటున్నారు.

కంపార్టుమెంటులో అందరి దృష్టి ఈ గొడవ ఆకర్షించింది. అందరూ కుతూహలంగా అటు వేపు చూడ సాగేరు. ఉత్సాహం పట్ట లేని

కొందరు దగ్గరగా వచ్చి, గుమి గూడేరు. టీవీ సీరియల్లో నవపాషాణాల పెట్టె లాగ, ఆ పెట్టెలోని రహస్యం తెలుసుకోవాలని వాళ్ళ ఉబలాటం.

జనాలు గుమి గూడడంతో పోలీసులు మరింత రెచ్చి పోయి దబాయించడం మొదలు పెట్టారు.

" సెవిలో పూలెట్టకండి...తాళం పోనాదా ! ఓసోసి ముసిల్దానా ! నాకాడ కతల్సెప్పకు... నీలాంటి కంత్రీ నెంజల్ని సేనా మందిని సూసేను... తాళం తియ్..."

"ఏట్నేదంటే యినవేం.." బెక్కుతూ అందామె.

" అవునందులో ఏటీ నేదయ్యా... నాలుగు సింకి గుడ్డలు, మాయే, ... మరేట్నేవు... మమ్మల్నొగ్గీ తండ్రీ నీకు దండఁవెడతాను..." తొట్రు పాటు పడుతూ దీనంగా వేడుకుంటున్నాడు, ముసిలాయన.

వాళ్ళ కంగారు చూసేక, ఆ పెట్టెలో తాము ఊహిస్తున్నట్టుగా సారా పేకెట్లు కచ్చితంగా ఉండా తీరాలని నిర్ధారణ కొచ్చేసేరు పోలీసులు. దాంతో వాళ్ళ పట్టుదల మరింత ఎక్కువయింది. వాళ్ళు ఆ ముసలి దంపతులని మరింక వదల దల్చుకో లేదు.

ఆ పాసింజరు రైలు ఒరిస్సా రాష్ట్రం నుంచి ఆంధ్రా సరిహద్దుల్లోకి సరిగ్గా అర్ధ రాత్రి పూట ప్రవేశిస్తుంది. చిన్నా చితకా వ్యాపారులు కర్రలూ, బొగ్గుల బస్తాలూ , చిన్న చిన్న మూటలతో బియ్యం – ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన పార్వతీ పురానికి విరివిగా చేర వేస్తూ ఉంటారు. వీళ్ళకి రైల్వే అధికారులూ, పోలీసుల అండదండలు బాగానే ఉంటాయి. సాధారణంగా వీళ్ళలో ఎవరూ టిక్కెట్లు కొని ప్రయాణం చెయ్యరు.

ఈ మధ్య నిషేధం అమలు లోకి వచ్చేక, మద్యం అక్రమ రవాణా ఆ రైల్లో ఎక్కువయింది. కొత్త కొత్త పద్ధతుల్లో సారా పేకెట్లనీ, మద్యం సీసాలనీ ఆంధ్రాలోకి సరఫరా చేస్తున్నారు. నిషేధం ఎత్తి వేసాక కూడా సారా పేకట్ల రవాణా తగ్గ లేదు. ఈ లాభసాటి అక్రమ వ్యాపారంలో చాలా మంది జేబులు నింపుకుంటున్నారు.

చెకింగు ముమ్మరమైంది. అస్మదీయులని చూసీ, చూడనట్లు వదిలేసినా, కొందరి మీద మాత్రం కేసులు బుక్ చేస్తున్నారు.

" తాళం పోనాదంటే నోట్లో ఏలేసుకుని ఎలి పోతాఁవనుకుంటున్నావు గావాల ! ఓర్నాయనో యిదెవత్తో జగజ్జెంత్రీ నాగుంది... ఓసి ! కిలాడి ! ...తియ్యవే తాళం..." హుంకరించేడు పోలీసు.

"అందులో ఏట్నేదని సెప్పవే నెంజా" ముసిలాయన భయంతో వణికి పోతున్నాడు. పెట్టెకి అడ్డంగా ముసిలామె కాళ్ళముందుకి జరిగాడు.

" స ! నెగెస్ ! రైల్లోంచి బయటకి యిసిరీ గల్ను..." ముసిలాయన జబ్బ పట్టుకుని, బలంగా పక్కకి నెట్టాడు బుర్ర మీసాల పోలీసు. ముసిలాయన దబాలున పక్కకి పడ్డాడు. బాత్ రూం తలుపు అంచుకి వాడి తల తగిలింది. బాధగా మూలిగేడు.

" ఓలమ్మ... ముసిలోడ్ని సంపేస్తారు గావాల్న...మీకేటి పోగాలఁవా ! సెప్తే యినుకో రేటీ !..అందులో ఏట్నేవ్..." గుండెలు బాదుకుంటూ ఏడుస్తోందామె.

రెండో పోలీసుకి తిక్క రేగింది. ముసిల్దాని జబ్బ పట్టుకుని,గుంజి, దాని రొండిన చెయ్యి పెట్టి తాళం చెవి లాగేడు.

ఆమె ఏడుపు తారాస్థాయినందుకుంది.

" బాబ్బాబు... చెమించండి... అందల ఏటీ నేవు...ఒగ్గెయ్యండయ్యా...మీకు పున్నెముంటాది..." కన్నీళ్ళతో దేబిరిస్తూ ఆ పోలీసు కాళ్ళకి చుట్టు కుందామె.

పురుగును దులపరించేసినట్టుగా ఆమెని పక్కకి పడేలా విదిల్చి కొట్టేడతను.

" ఓరి బాబూ ! యీ ముసిల్ది గుండెలు తీసిన బంటు నాగుందిరా నాయనా ! ...సూడు ... సూడు... అందల ఏటుందో... అందులో సరుకు దొరకాల ! యీళ్ళ పనుంది అప్పుడు..." రెండో పోలీసు హుషారుగా అన్నాడు.

" మా బాబ్బాబాబు... ఆ పెట్టి తెరవకండి... మీకు దండఁవెడతాను..." ముసిలామె గుండెలవిసేలా ఏడుస్తోంది.

వాళ్ళు తాళం తీసి, పెట్టె తెరవబోతూ ఉంటే, భయంతో ఎక్కడ లేని సత్తువ వచ్చినట్టు తటాలున లేచి నించున్నాడు ముసిలాయన.

" దాన్ని తెరవొద్దు ...తెరవొద్దు బాబూ... సచ్చి మీ కడుపుల పుడతా....తండ్రీ... తెరువొద్దు .. ఓలమ్మ దేవుడా ! ని మాటిను కోండి. దాన్ని తెర వొద్దయ్యా..." కంగారు కంగారుగా, భయం భయంగా వేగం వేగంగా – అతి దీనంగా వేడుకుంటున్నాడు ముసిలాయన.

అందరిలోనూ ఉత్కంఠ ఎక్కువయింది. పోలీసు పెట్టె తాళం తీసి, తెరుస్తూ ఉంటే, తొంగి తొంగి కుతూహలంగా చూడ సాగేడు.

తమ ప్రయత్నాలన్నీ విఫలమై నిస్త్రాణగా ముఖం చేతుల్తో కప్పుకుని, కూలబడి పోయిందామె. ముసిలాయన జవసత్వాలు ఉడిగి పోయి, కొయ్యబారి పోయేడు. వాళ్ళ గుండెలు భయంతో అవిసి పోతున్నాయి.

అందరిలోనూ అంతు లేని ఆత్రుతనీ, కుతూహలాన్నీ రేపిన ఆ పాత కాలపు రేకు పెట్టె చివరకి తెరిచి చూసేడు పోలీసు.

అంతా అవాక్కయి పోయేరు !

నిజమే !

వాళ్ళన్నట్టు అందులో నిషేధ వస్తువు లేవీ లేవు ... ఓ నాలుగు మాసిన బట్టలూ, కొయ్య దువ్వెన, చిన్న అద్దం – యిలాంటివే ఏవో ఉన్నాయి.

పోలీసులిద్దరికీ మతి పోయింది. ఈ పాటి దానికి ఆ ముసిలాళ్ళు ఇద్దరూ అంత హైరానా ఎందుకు పడి పోయేరో వాళ్ళకి అర్థం కాలేదు. చేతివ వరకూ వచ్చిన నిధి జారి పోయినట్టుగా నిరాశ పడి పోయేరు. ఆ పెట్టె లోని బట్టలని చిందర వందర చేసి, తిట్టుకుంటూ,

వాళ్ళ నొదిలి వేరే కంపార్టుమెంటు లోకి వెళ్ళి  పోయేరు.

చుట్టూ చేరిన జనాలకి యిదంతా  చిత్రంగా తోచింది. ఈ మాత్రం దానికి, ఆ ముసిలాళ్ళు ఇద్దరూ ఎందు కంతగా భయ పడి పోయేరో వాళ్ళకి అర్ధం కాలేదు.  " మతి స్థిమితం లేదు కాబోలు"  ఒకరిద్దరు  కామెంటు  చేసారు. కొంత చిరాగ్గానూ, మరి కొంత ఏదో తమాషా చూసే మన్న తృప్తి తోనూ అందరూ తమ తమ సీట్లలోకి సర్దుకున్నారు.

రైలు పరిగెడుతూనే ఉంది.   ఆ  జనరల్ బోగీ లోని చిన్న ప్రపంచం తిరిగి తన ధోరణి లోకి తాను పడి పోయింది.

గాజు కళ్ళలో వెయ్యి ప్రశ్నార్ధకాలు నింపుకుని, ఆ ముసిలాయన  భార్య ముఖంలోకి చూసేడు. పెట్టెలో ఉండ వలసినదేదో లేక పోవడం తో, అతనికి ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. కోపం  తెప్పిస్తోంది.  భార్య అతని ముఖంలోకి దీనంగా చూసింది. మరేం అనవద్దని తల తాటిస్తోంది.

ముసలాయన కోపంగా ఆమె వేపు చూసేడు.

" ఆట్నేటి సేసినావే ." కోపంతో అతని ముకుపుటాలు అదిరి పోతున్నాయి.  ఏం చెప్పాలో తోచ లేదు ఆమెకు.

" నీ యవ్వ... నిజం సెప్తావా, రైల్లోంచి  దూకి సావమంటావా?" చూపుడు వేలు ఆమె ముఖం మీద ఆడిస్తూ బెదిరించేడు.

" ఓరి దేవుడా !"  గొల్లున ఏడుస్తూ చేతుల్లో ముఖం దాచుకుందామె. భార్య బదులు చెప్పక పోవడంతో ముసిలాయనకి చిర్రెత్తు కొచ్చింది.

భార్య జుట్టు పట్టుకుని, వంచి, నడ్డి మీద దబ దబ బాదుతూ అరుపులు ప్రారంభించేడు.  " పెట్లో దాచేనని నాతో అబద్ధమెందుకాడి నావే? సెప్పు...ఆటినేటి సేసేవు ? గవిరి గాడికి నేనేటి సెప్పు కోవాల ? ఉత్తి సేతుల్తో వొస్తే అమ్మి  నొగ్గేస్తానని ఆడు సెప్ప నేదా ! మన బిడ్డ నచ్చు మమ్మ సమసారం  బుగ్గయి పోతాదని తెల్దా నీకు? కన్నకూతురి  బతుకులో నిప్పులు పోస్తున్నావు గదే - నీ యవ్వ... నీ కిదేటి పోగాలంవే?..."

వాడు కొట్టిన దెబ్బలకి తట్టు కోలేక ముసిలావిడ లబో దిబోమంటోంది. కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది.

ఆ ముసిలి దంపతులు దేని కోసం అలా ఘర్షణ పడుతున్నారో కంపార్టుమెంటులో ఎవరకీ అర్ధం కావడం లేదు.

ఒకరిద్దరు కలగ జేసుకుని, ముసిలాయన్ని శాంతింప చేద్దామని ప్రయత్నించేరు. కానీ, సాధ్య పడ లేదు.  మరింత రెచ్చి పోయి, భార్యని చితక బాదు తున్నాడు.

ముసిలామె ఏడుస్తూ కొట్టొద్దని బతిమాలు తోంది. కాళ్ళా వేళ్ళా పడింది. వేడుకుంటోంది.

దెబ్బలు తిని తిని విసిగి పోయి, ఆఖరికి ఒక్క సారిగా భర్త మీదకి తిరగ బడింది.      భర్త రెండు జబ్బలూ పట్టుకుని, ఒక్క కుదుపుతో పక్కకి పడేలా తోసింది.

సన్నని జీరతో ఏడుస్తూ , అయినా , స్ఫుటంగానే , అంది : "" ఓరోరి ముసిలాడా ! -ఏట్రా నీ పోత్రం? మరొక్క దెబ్బ నా వొంటి మీద పడినా దంటే మక్క లిరగదీసీ గల్ను.  జేగర్త -జెర్రి పోతుల కాము నాయుడి గారి బొట్టిని ! ఏటను కుంటున్నావో ?"

ముసిలాడు ఆమె విసిరిన విసురుకి జనాల కాళ్ళ దగ్గర పడి రొప్పుతున్నాడు.

అసలు విషయం ఏమిటని ఎవరో అడిగేరు.

" మజ్జి గైరమ్మ యాత్ర కెల్నాం బాబూ !  ఒరిస్సాలో సారా తాగితే పోలీసు  లట్టు కోరు కద? మా అల్లుడోడు... ఆడనుండి సారా పేకెట్లు తెమ్మని యీడికి సెప్పినాడు... సారా పేకెట్లు తేకండ  వుట్టి సేతుల్తో వొస్తే గమ్మం నోకి రానియ్య నన్నాడు...నా కూతురి మీద కిర్సనాయిలు పోసి తగలెట్టేస్తా నన్నాడు... ఆతాగుబోతెదవ మాటలకీడు బెదిరి పోనాడు... ఆడ సారా పేకెట్లు కొని, పెట్లో  ఎట్టమని కూకున్నాడు.

" మరి, వాటినేం చేసావ్? పెట్లో ఏం లేక పోతే మరంత భయపడి పోయావెందుకు?" ఆసక్తిగా అడిగేడొకాయన.

" నేనంత సెప్పినా యిన లేదు. ఆట్నీ పెట్ట లెట్టి, మా వూరికి తీసి కెళ్ళాల్సిందే నని పేచీ ఎట్టేడు. నేక పోతే అసలు రైలెక్కనని పట్టు పట్టేడు... ఆ మహమ్మారి పేకెట్లని అక్కడే , టేసను బయట యీడికి తెలీకుండా పారీసినాను..."

ముసిలాయన తెల్ల బోతూ వింటున్నాడు.

" ఈడి మాటలిన్నారు కద బాబు? అల్లుడోడికి బెదిరి పోయి, నా కూతురి  బతుకులో నాను  నిప్పులు పోస్తున్నానంటున్నాడు... మీరు సెప్పండి... దాని బతుకు బండలు సేస్తున్న దెవులు? నా పెనిమిటి కాదా ! మా అల్లుడోడు కాడా...!?"

" మరి -  అల్లుడోడికి ఏటి సెప్తావే..." ముసిలాయన నీళ్ళు నములుతున్నాడు.

జారి పోయిన జుత్తుని వేలు ముడి వేస్తూ, కోపంగా జవాబిచ్చింది. ముసిలామె : "థూ !.. నీ సిగ్గోసిరి ...ఆడికి బయ పడతావేటెస్... **మా సెల్లూరప్ప ఏటి సేసి నాదో ఎరిక నేదా !** ఈడు మల్ల సారా వూసు ఎత్తి నాటంటే ... ఈడి కాళ్ళిరిసీసి పొయ్యిలెట్టేస్తాను... తెల్సిందా !"

ముసిలావిడ మాటల్ని హర్షిస్తూ  - చప్పట్లు కొడుతున్నట్టుగా  రైలు ధణ ధణ మని శబ్దం చేస్తూ  పరిగెడు తోంది.

0 0 0

ఆంధ్ర జ్యోతి సచిత్ర వార పత్రిక దశాబ్ది ప్రత్యేక  సంచిక  (15-8-1997)లో ప్రచురణ.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారు ప్రచురించిన ‘ 1997 - తెలుగు కథ ’ కథా సంకలనంలో పునర్ముద్రణ .

సంపాదకులు : ఆచార్య జయధీర్ తిరుమల

చురణ : నవంబరు 1994.

# గెలుపు

‘ మధ్యాహ్నం మీ కేదో ఉత్తరం వచ్చిందండీ ! ఆ డ్రాయరు మీద ఉంచేను . తీసుకోండి. ! ” అంటూ పార్వతి , వంట గది అనబడే తడికెల చాటు నుంచి అరిచింది. కాఫీ గ్లాసు టేబిలు మీద ఉంచి , ఉత్తరం తీసాను. కవరు మీద అడ్రసు చూడగానే ఎవరు రాసేరో తెలిసి పోయింది. ఆ దస్తూరీతో నాకు గతంలో కొన్నేళ్ళ పరిచయం ఉంది మరి !

“ పారూ ! వాసు గాడు ఉత్తరం రాసాడే !” అని అరిచేను , ఆనందంద పట్ట లేక. చేతులు కొంగుకి తుడుచు కుంటూ వచ్చి , ద్వారాన్ని ఆనుకుని నిల్చుంది పార్వతి. ఆత్రంగా ఉత్తరం విప్పి చదివాను. ముత్యాల్లాంటి లక్షరాల్లో ఆప్యాయతని అద్ది రాసాడు వాసు.

“రామం అనబడే ఇడియట్‌కి,

ఎన్నేళ్ళయిందిరా , నిన్ను చూసి ! బాగున్నావా ! లేక యింకా అప్పటి లాగే ఉన్నావా ! నిన్ను హైస్కూల్లో అంతా స్కెలిటినని ఏడిపించే వాళ్ళు కదూ?! ఓ సారి కామేశం గాడు నిన్ను ‘ ఒరే , రమణా రెడ్డి తమ్ముడూ ! ’ అని పిలిచేడని కళ్ళలో నీళ్ళు కుక్కు కున్నావు. నిన్ను చూసి , అప్పుడు నాకు బలే జాలి వేసింది. ఆ రోజు సాయంత్రం అంబటి సత్రం దగ్గర బీటు వేసి , కామేశం గాడిని తంతానని బెదిరించి నీకు క్షమాపణలు చెప్పించాను.

“ నీకు గుర్తుందా ! ఓ రోజు అయ్య కోనేరు గట్టు మీద చేపలు పట్టే కుర్రాడికీ నీకూ ఎందుకో మాటా మాటా వచ్చి నప్పుడు నేను తమాషాకి ఆ కుర్రాడి పక్షం చేరి నీతో వాదిస్తే నీకు చాలా కోపం వచ్చింది. నాతో మట్లాడటం కూడా మానీసేవు !

“ గెలుపు నాదే అప్పుడు ! నువ్వే కదూ , ముందు వచ్చి మాట్లాడీసేవు ?

“హైస్కూల్లో సెక్రటరీగా నాకు ప్రతిగా పోటీ చేసి నువ్వు చిత్తుగా ఓడి పోయేవు. అప్పుడు మళ్ళీ నా మీద నీకెంత కోపం వచ్చిందని ! సరదా కోసం ఇద్దరం ఎదురెదురుగా పోటీ పడ్డాం. నువ్వు మాత్రం మన నిబంధనని మరిచి పోయి ,అపజయాన్ని తీవ్రంగా తీసుకున్నావు.

“ అవేళ , నీకు గుర్తుందా ! ... నన్ను కవ్వించేవు. దమ్ముంటే అయోధ్యా మైదానం దగ్గరకి నిన్ను ఎదుర్కోడానికి రమ్మన్నావు. నీతో పోటీకి నేనెప్పుడూ సిద్ధమే ! నాకు తెలుసు . గెలుపు నాదే ! రాస్కెల్... అప్పుడే ఉడుక్కుంటున్నావు కదూ ?

“అంత వరకూ మనిద్దరం ఎంతో స్నేహంగా ఉండి , ఏదో చిన్న గొడవల్లో పడి , కొట్టుకోడానికి సిద్ధ పడి పోయేమన్న వాం స్కూల్లో అందరి చెవుల్లోనూ పడి పోయింది. అంతా వింత చూడాలని , ఆశతో అయోధ్యా మైదానం దగ్గరకి వచ్చేరు.

“వింతే చూసారు !

“ఆ రోజు నీ చెయ్యి దొరక బుచ్చుకుని గట్టిగా షేక్ చేసి, నీ చెవిలో ఓ విషయం చెప్పాను. అదేమిటో , యివాళ నీకు జ్ఞాపకం ఉందా , రామం ? ”

ఉత్తరం చదవడం ఆపేను. నా వొళ్ళు ఎందుకో గిలి గింతలు పెట్టినట్టయింది. కళ్ళలో చప్పున ఆనందంతో నీళ్ళు తిరిగాయి. టప టపమని ఉత్తరం మీద పడ్డాయి.

ఆ వేళ మా దొమ్ములాట వింతగా చూడాలని ఆశతో వచ్చిన విద్యార్ధులందరి ముందూ , నా చెయ్యి దొరక పుచ్చుకుని , ఆప్యాయంగా నిమిరి , బలంగా షేక్ చేసి ... నా చెవిలో వాడు చెప్పిన విషయం నాకు బాగానే గుర్తుంది. దాన్ని ఎలా మరిచి

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=558**